సాక్షి రంగారెడ్డి

మంగళవారం : 2 : మే : 2023



ఆటోబోల్తా

కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో 13 మందికి గాయాలయ్యాయి. 8లో ▸



ఎదురెదురుగా కార్లు ఢీ

ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా.. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. 8లో ▸



రహదారిపై వరదనీరు

వర్షాలకు రహదారిపై వరదనీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ తిరుపతిరావు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేయాలని అధికారులకు సూచించారు. అధిక ప్రాధాన్యత కలిగిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మౌనిక మృతి కలచివేసింది

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మౌనిక కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: నాలాలో పడి చనిపోయిన చిన్నారి మౌనిక మృతి అందరినీ కలచివేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి సోమవారం ఆయన అందించారు. చిన్నారి లేని లోటు తీర్చలేనిదన్నారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మౌనికను తలుచుకుంటూ రోదిస్తున్న తల్లిదండ్రులు రేణుక, శ్రీనివాస్‌లను మంత్రి ఓదార్చారు. తలసాని వెంట డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సుదర్శన్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు ఆంజనేయులు, విజయ్, భాస్కర్, జగత్‌రావు తదితరులు ఉన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కేటాయింపు నేడు

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన నాగోల్ బండ్లగూడ, పోచారంలలో మిగిలిపోయిన ఫ్లాట్లను మంగళవారం కేటాయించనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. గత నెల 15 నాటికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించిన వారి పేర్లతో పారదర్శకంగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు వారు చెప్పారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

7న రాజశ్యామల దేవాలయ శిలాన్యాసం

మణికొండ: నగర శివారు కోకాపేటలో శ్రీశారదా పీఠం ఆధ్వర్యంలో రాజశ్యామల దేవాలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం దేవాలయ శిలాన్యాస మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పీఠం నిర్వాహకులు తెలిపారు. శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు. దక్షిణ భారతానికే తలమానికంగా నిలిచేలా శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా, చోళులు, పల్లవుల నిర్మాణశైలి ఆలయానికి వన్నె తెస్తుందని వారు తెలిపారు. ఇప్పటి వరకు అమ్మ వారి దేవాలయం దేశంలో ఒక విశాఖపట్టణంలోనే ఉందని, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగానూ ఆలయ నిర్మాణం కానుందన్నారు. 7వ తేదీన జరిగే శిలాన్యాసం కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించనున్న వైద్యులు

కాచిగూడ: ఎవరెస్ట్ బేస్ క్యాంపునును అధిరోహించేందుకు ఇద్దరు డాక్టర్లతో కూడిన బృందం ఈ నెల 6న నగరం నుంచి బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారు. 71 ఏళ్ల వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, 67 సంవత్సరాల మిసెస్ ఇండియా అవార్డు గ్రహీత డాక్టర్ నక్కన శోభాదేవి ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. జీవితంలో పట్టుదలతోనే ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని నేటి యువతరానికి అందించేందుకే ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు.

కృష్ణా.. వచ్చేనా?

- కొత్త సచివాలయంలో 'పాలమూరు-రంగారెడ్డి'పై సంతకం చేసిన సీఎం
- దీనిపైనే సెక్రటేరియెట్‌లో తొలి సమావేశం
- మొదట తాగునీటి అవసరాలకు అనుమతి
- 5వ జలశాయం ఉదండాపూర్ నుంచి రెండు కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాలో పారనున్న కృష్ణాజలాలు
- 6,28,206 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం



చేవెళ్ల: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తాగు, సాగునీరును అందించేందుకు నిర్ణయించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా జిల్లాకు కృష్ణానీళ్లు రానున్నాయి. దీనికి సంబంధించిన ఫైలుపై కొత్త సెక్రటేరియెట్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేయడంతోపాటు సోమవారం ఈ ప్రాజెక్టుపైనే తొలి సమావేశం కూడా నిర్వహించారు. జిల్లాకు సాగు, తాగునీరు వస్తే ఎన్నో ఏళ్ల ప్రజల నిరీక్షణకు తెరపడనుంది. 2015 జూన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ పథకానికి రూ.5,180 కోట్ల మంజూరుకు అనుమతిచ్చారు. పనులు కొనసాగుతుండగా అనుమతులకు సంబంధించి పలు అడ్డంకులు ఎదురయ్యాయి. గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసులు తదితర అంశాలతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇటీవలే స్టే విధించి, తాగునీటికి సంబంధించిన పనులు చేపట్టడానికి అనుమతులు లభించాయి. దీంతో ప్రస్తుతం పంపుహౌస్‌లు, ప్రధాన కాలువలు, జలాశయాల నిర్మాణాల పనులు కొనసాగుతున్నాయి.

5వ జలశాయం నుంచి..

కొల్లాపూర్ మండలం నార్లాపూర్ నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోని బ్యాక్ వాటర్ తీసుకోనున్నారు. అక్కడి నుంచి ఈ ప్రాజెక్టు 19వ ప్యాకేజీలోని 5వ జలాశయమైన ఉదండాపూర్‌కు తరలిస్తారు. అటు నుంచి 20, 21వ ప్యాకేజీ కింది షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేపీ లక్ష్మీదేవిపల్లిలో జలాశయాన్ని నిర్మించి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు తరలించాలని భావించారు. కానీ పనులు ఉదండాపూర్ వరకే పరిమితమయ్యాయి. చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులతో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో మార్చిలో పర్యటించారు. ఎడారి ప్రాంతంగా ఉన్న వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల వరకు నీటిని అందించాలని కోరారు. దీనిపై నీటిపారుదల శాఖ ప్రాథమిక సర్వే చేపట్టి తాజాగా ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఉమ్మడి రంగారెడ్డితోపాటు నల్లగొండ జిల్లా వరకు నీటిని తరలించాలంటే ఉదండాపూర్ జలాయశం నుంచే నీటిని తీసుకోవాలని సూచించింది. దీంతో 5వ జలశాయం ఉదండాపూర్ నుంచే జిల్లాకు కాలువల ద్వారా ఈ నీళ్లు రానున్నట్లు తెలుస్తోంది.

రైతులకు వరం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా వచ్చే నీళ్లతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 6,28,206 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల కృష్ణానీటిని ఎత్తిపోయనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో కలిపి మొత్తంగా 12.20 లక్షల ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ప్రాజెక్టు 5వ జలశయమైన ఉదండాపూర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 16 టీఎంసీలు కాగా ఈ జలశాయం నుంచి గ్రావిటీ ద్వారా కుడి, ఎడమ కాలువల మార్గంలో చివరి వరకు (మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ) మొత్తం 9.36 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. ఈ కాలువల మార్గంలోని వందల గ్రామాలకు తాగునీరు అందిస్తారు. ఎడుమ కాలువను 133 కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తున్నారు. ఈ కాలువ కింద 5,08,116 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. ఇందులో పరిగి, తాండూరు, నారాయణపేట, వికారాబాద్ వరకు తాగు, సాగు నీరు అందిస్తారు. ఈ కాలువ ద్వారా వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 4,19,459 ఎకరాలకు నీరు అందనుంది. ఇక 105 కిలోమీటర్ల పొడువుతో నిర్మిస్తున్న కుడి కాలువ కింది 4,28,568 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ఈ కాలువ ద్వారా వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి 2,08,747 ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతులకు ఎంతో మేలు జరుగనుంది.

కల్యాణ ఘడియలు

- రేపటినుంచి మోగనున్న పెళ్లిబాజాలు
- మే, జూన్ నెలల్లో 23 శుభముహూర్తాలు
- ఒక్కటి కానున్న వందల జంటలు



షాబాద్: శభముహూర్తాలు వచ్చేశాయి. గురు మూఢం కారణంగా ఏప్రిల్‌లో పెళ్లిళ్లకు బ్రేక్‌లు పడ్డాయి. ఈనెల 3న బుధవారం నుంచి మళ్లీ పెళ్లి భాజాలు మోగనున్నాయి. పెళ్లి సందడి నెలకొననుంది. కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడనున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా, వంటవారు, బాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాలు ఇలా..

ఈనెల 3 నుంచి వరుసగా 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31.. జూన్‌లో 1, 3, 7, 8, 9, 10, 11 తేదీల్లో సుముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. జూన్ 19 నుంచి ఆషాఢమాసం మొదలై, జూలై మొత్తం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18 వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

రద్దీగా దుకాణాలు..

ఈనెల 3 నుంచి పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. ఇప్పటికే అన్ని ఫంక్షన్ హాళ్లు ముందుస్తుగా బుక్ అయ్యాయి. ఈసారి అధికంగా ముహూర్తాలు ఉండటంతో నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకు మొత్తం 25 రంగాల వారికి చేతినిండా ఉపాధి ఉండనుంది. వేదబ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్‌సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు, ఈవెంట్ ఆర్గనైజర్లు, ఫోటోగ్రాఫర్లు, వ్యాపారులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండునెలల్లో మంచి రోజులు



ఏప్రిల్‌లో ముహూర్తాలు లేవు. మే, జూన్ నెలలో 23 మంచి రోజుల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. జూలైలో మంచి రోజులు లేవు. ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

– రమేష్ పంతులు, తాళ్లపల్లి

సచివాలయానికి నయా ఠాణా



- లేక్ పోలీసుస్టేషన్ బదులు దీని ఏర్పాటు
- మధురానగర్ కేంద్రంగానూ పోలీసుస్టేషన్
- ప్రత్యేక విభాగాలకు సర్కారు ఆమోదముద్ర

సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీ కమిషనరేట్‌లో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసుస్టేషన్ ఉన్నట్లే హైదరాబాద్‌లో సెక్రటేరియేట్ ఠాణా ఏర్పాటు కానుంది. హుస్సేన్‌సాగర్ తీరాన అందుబాటులోకి వచ్చిన సచివాలయం కేంద్రంగా ఇది పని చేయనుంది. పార్లమెంట్ పోలీసుస్టేషన్‌కు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉంటారు. సచివాలయం ఠాణాకు ఏ స్థాయి అధికారి ఉంటారన్నది తేలాల్సి ఉంది. దీంతో పాటు పునర్ వ్యవస్థీకరణలో భాగమైన ఠాణాలు, డివిజన్లు, జోన్లు, ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుకు ఆమోద ముద్ర పడింది. ఈ మేరకు హోం శాఖ కార్యదర్శి జితేందర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సచివాలయంలోని తన చాంబర్‌లో అడుగుపెట్టిన హోం మంత్రి మహమూద్ అలీ ఈ ఫైల్‌పై ఆదివారమే సంతకం చేసిన విషయం విదితమే. ప్రాథమిక ప్రతిపాదనల ప్రకారం హైదరాబాద్ కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణతో కొత్తగా రెండు జోన్లు, 10 డివిజన్లు, 13 ఠాణాలు ఏర్పాటు కావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో 11 డివిజన్లు, 11 ఠాణాలే వచ్చి చేరుతున్నాయి. దీంతో జోన్ల సంఖ్య ఏడుకు, సబ్-డివిజన్లు 28కు, ఠాణాలు 72కు చేరతాయి. లేక్ ఔట్‌పోస్టును ఠాణాగా మార్చాల్సి ఉండగా దీని స్థానంలో సెక్రటేరియేట్ ఠాణా ఏర్పాటు చేస్తున్నారు. నార్త్‌జోన్‌లో తాడ్‌బన్ ఠాణా ఏర్పాటు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. పశ్చిమ మండలంలో రెహ్మత్‌నగర్ పోలీసుస్టేషన్‌కు బదులుగా మధురానగర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. శాంతిభద్రతల విభాగంలో కొత్తగా వస్తున్న సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్లకు అదనంగా ట్రాఫిక్ వింగ్‌లో మూడోదిగా సౌత్ ఈస్ట్ డివిజన్ వస్తోంది. ప్రస్తుతం ఉన్న, అందుబాటులోకి రానున్న జోన్లతో కలిపి మొత్తం ఏడింటికీ ప్రత్యేకంగా జోనల్ పోలీసు కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కొత్తగా రెండు టాస్క్‌ఫోర్స్, ఒక ఐటీ సెల్, సైబర్ క్రైమ్ వింగ్స్ ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీకి ఉన్నట్లుగా సచివాలయం కోసం ప్రత్యేకంగా సెక్రటేరియేట్ సెక్యూరిటీ వింగ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. మహిళల భద్రత కోసం నగర వ్యాప్తంగా ఐదు ఉమెన్ సేఫ్టీ వింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (హెచ్-న్యూ) స్పెషల్ యూనిట్ హోదా వచ్చింది.

5, 6 తేదీల్లో ఇంజనీరింగ్ సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 5, 6 తేదీల్లో వివిధ విభాగాల్లో జాతీయ సింపోజియాలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సింపోజియాల్లో సదస్సులు, పేపర్ ప్రజెంటేషన్స్, ఎగ్జిబిషన్స్, రోబోటిక్, వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఇంజనీరింగ్, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉందన్నారు.

సినీ ప్రముఖులకు సత్కారం



ఆర్ఆర్ఆర్ చిత్ర పాటల రచయిత చంద్రబోస్‌కు సత్కారం

గచ్చిబౌలి: తెలుగు సినీ కార్మికుల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి వీడియో ద్వారా తన కార్మిక దినోత్సవ సందేశాన్ని పంపగా వినిపించారు. అనంతరం ఫిలిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ చిత్రానికి పనిచేసిన ఇరవై నాలుగు విభాగాల వారిని ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా పాటల రచయిత చంద్రబోస్, సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్‌కుమార్, ఆర్ట్ డైరెక్టర్ సాబూసిరీస్, స్టంట్ మాస్టర్ కింగ్ సాలమన్‌లను ఘనంగా సత్కరించారు. ఫిలిమ్ ఫెడరేషన్‌కు ఇటీవల ఎన్నికైన అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కోశాధికారి వి.సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల సినీ కార్మికులకు పెంచిన వేతనాల అగ్రిమెంట్లను ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వారికి ఫిలిం చాంబర్ అందించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం, ఫిలించాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, దర్శకుడు కాశీ విశ్వనాథ్, ఎన్ శంకర్, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, సి.కళ్యాణ్, దామోదరప్రసాద్, ప్రసన్నకుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా వానలు



కొందుర్గులో నేలరాలిన మామిడికాయలు

- అకాల వర్షాలతో ఆగమాగం
- పెద్ద ఎత్తున పంటలకు నష్టం

తుర్కయంజాల్: అకాల వర్షాలతో జిల్లాలోని పలు మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతోంది. ఎండలు దంచాల్సిన సమయంలో ఆకాశం మేఘావృతమై, చల్లగాలి వీస్తుండటం వేసవి నుంచి ఉపశమనం కలిగించేదే అయినా పెద్దఎత్తున గాలి దుమారం, వడగళ్ల వాన కురుస్తుండటంతో చేతికి వచ్చిన పంటలను రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. కల్లాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇక మామిడి తోటల రైతులకు ఈ వర్షాలు తీరని నష్టం చేకూరుస్తున్నాయి.

కరెంట్ కట్..

పెద్ద ఎత్తున అకాల వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి ఈదురు గాలులకే విద్యుత్ సమస్యలు తలెత్తుతుండటంతో గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 18 గంటలు గడిచినా కొన్ని కాలనీల్లో కరెంటు సరఫరా పునరుద్ధరణ జరగలేదు.

గడిచిన ఏడేళ్లలో ఏప్రిల్‌లో నమోదైన వర్షపాతం (మి.మీ)

సంవత్సరం	నమోదైన వర్షపాతం	సాధారణ వర్షపాతం
2016-17	13.3	14.0
2017-18	37.7	14.0
2018-19	26.8	14.0
2019-20	22.8	14.0
2020-21	29.9	14.0
2021-22	12.3	14.0
2022-23	61.5	14.0

'నేలరాలిన' ఆశలు

కొందుర్గు: వడగళ్ల వర్షం రైతులను నిలువునా ముంచింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నేలపాలు కావడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. మండలంలోని ఆగిర్యాలలో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు చేతికందే సమయంలో పంటలు నేలరాలాయి. వరి, మామిడి, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆగిర్యాలలో 154 మంది రైతులకు సంబంధించి 262 ఎకరాల్లో వరి దాదాపు 50 శాతం దెబ్బతింది. 32 మంది రైతులకు చెందిన 150 ఎకరాల మామిడి, 11 మంది రైతులకు సంబంధించిన 9 ఎకరాల టమాట పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివారం రాత్రి నుంచి నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	నమోదైన వర్షపాతం
శంకర్‌పల్లి	21.7(ఎంఎం)
శేరిలింగంపల్లి	41.5
గండిపేట	77.5
రాజేంద్రనగర్	33.8
బాలాపూర్	27.6
సరూర్‌నగర్	49.4
హయత్‌నగర్	46.3
అబ్దుల్లాపూర్‌మెట్	37.5
ఇబ్రహీంపట్నం	12.0
మంచాల	22.0
యాచారం	32.2
మాడ్గుల	24.8
ఆమనగల్లు	7.7
తలకొండపల్లి	13.2
కేశంపేట	8.4
కడ్తాల్	8.3
కందుకూరు	24.8
మహేశ్వరం	14.1
శంషాబాద్	31.3
మొయినాబాద్	29.8
చేవెళ్ల	24.6
షాబాద్	24.2
కొత్తూరు	22.2
నందిగామ	32.0
ఫరూఖ్‌నగర్	17.3
కొందుర్గు	24.3
చౌదరిగూడెం	22.0

కార్మిక హక్కులను కాలరాయొద్దు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

కందుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం మేడే ఉత్సవాలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో 56 రకాల చట్టాలు కార్మికులకు ఉండగా, మోదీ ప్రభుత్వం వాటిని రద్దు చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కనీసం పోరాటం, సమ్మె చేసే హక్కులను లేకుండా చేసిందని ఆరోపించారు. మరోవైపు వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు సమ్మెబాట పట్టినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. అనంతరం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన డీసీఎం

- మూడు ఎద్దులు మృతి
- ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు

నందిగామ: పశువుల లోడ్‌తో వెళ్తున్న ఓ డీసీఎం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు పశువుల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం నందిగామ చౌరస్తాలోని యూటర్న్ వద్ద అదుపు తప్పి వ్యతిరేక దిశంలో దూసుకెళ్లింది. రోడ్డుపై ప్రయాణిస్తున్న ఓ బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మూడు ఎద్దులు మృతి చెందగా.. ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి.


ప్రమాదస్థలిలో డీసీఎం

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తికి గాయాలు

చేవెళ్ల: మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని దామరగిద్ద బస్‌స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దాదాపు 55 ఏళ్లు ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి.. క్షతగాత్రుడిని 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు పరిశీలించగా అతని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. క్షతగాత్రుడికి మతిస్థిమితం లేకపోవడంతో వివరాలు తెలియలేదు. బాధితుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే చేవెళ్ల పీఎస్‌లో సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం ఆయన చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

కొందుర్గు: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడ గ్రామానికి చెందిన మంజులకు పర్వతాపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. కాగా కొంతకాలంగా దంపతులు గొడవపడుతున్నారు. పెళ్లి సమయంలో కట్నం తీసుకురాలేదని.. ఇప్పుడు తీసుకురావాలంటూ గోపాల్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఏప్రిల్ 20న భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు మంజులపై చేయిచేసుకున్నారు. దీంతో ఆమె సోమవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైబ్రరీ సెక్రటరీగా కిరణ్‌కుమార్

శంషాబాద్ రూరల్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటిన్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా నియమితులైన కె.కిరణ్‌కుమార్‌ను ఇండియన్ లీగల్ అడ్వకేట్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అంబేడ్కర్, పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని సమతాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద, డా.బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ డైరెక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

20 రోజులపాటు శిక్షణ

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు పాఠశాల కమిటీ అధ్యక్షుడు పాపిశెట్టి రాము తెలిపారు. సోమవారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. 20 రోజుల పాటు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ధ్యానం, యోగా, వ్యాయామం, సూర్య నమస్కారాలు, శ్లోకాలు, పాటలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు నారాయణగౌడ్, దొంతు సత్యనారాయణ, దొంతు విశ్వనాథం, అంజయ్య, తిరుపతయ్య, భాస్కర్, కవిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్ ఉమర్ కాలనీకి చెందిన షాహిద్ ఖురేషీ కుమార్తె షాహీదా(19) ఇంటర్ విద్యనభ్యసించింది. ఏప్రిల్ 28వ ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.


షాహీదా(ఫైల్)

వేధిస్తే ఫిర్యాదు చేయండి

యంగ్ ఇండియన్స్ టీం సభ్యురాలు పూజాలాల్వాని

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని తలసేమియా సికిల్ సెల్ సొసైటీలో యంగ్ ఇండియన్స్ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సెషన్‌లో టీం సభ్యురాలు పూజా లాల్వానీ, టీఎస్‌సీఎస్ ఈసీఓ డాక్టర్ సుమన్‌జైన్, డాక్టర్ సరోజ, అనిత పాల్గొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే రిపోర్ట్ చేయాలన్నారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే చెప్పే లా పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్, టీఎస్‌సీఎస్ సంస్థల సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

మహిళ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మంచాల: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా.. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆగాపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై రామన్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లికి చెందిన నారదాసు లలిత(38) ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో డైరెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె సాగర్ కాంప్లెక్స్‌లో నివసిస్తోంది. సోమవారం లలిత చింతపల్లికి చెందిన తన అక్క కుమారుడు మధుతో కలిసి హైదరాబాద్ వెళ్తోంది. ఆగాపల్లి సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న వేణుగోపాల్ కారును అతివేగంగా నడుపుతూ లలిత ప్రయాణిస్తున్న కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. లలిత సీట్ బెల్ట్ ధరించకపోవడంతో ఎయిర్ బెలూన్ ఓపెన్ కాకపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు సంతానం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సీట్ బెల్టు ధరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడేవారని ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. ప్రతీ ఒక్కరు తప్పక సీట్ బెల్టు ధరించాలని ఆయన సూచించారు. రెండు కొత్త కార్లు అవ్వడంతో ఇంకా పర్మినెంట్ నెంబర్ రాలేదు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


లలిత (ఫైల్)

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

13 మందికి గాయాలు

ఆమనగల్లు: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని మాలెపల్లి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కూలీలు ఆటోలో సింగపల్లి గ్రామానికి కూలికి వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మాలెపల్లి గ్రామశివారులో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో లక్ష్మి, అలివేలు, ప్రసన్న, పద్మ, చైతన్య, మౌనిక, పద్మమ్మ, అలివేలు, చంద్రమ్మ, పార్వతమ్మ, పద్మమ్మ, వెంకటమ్మ, పద్మ గాయపడ్డారు. దీంతో గమనించిన గ్రామస్తులను క్షతగాత్రులను ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక చికిత్స చేశారు. ఇద్దరి మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఎన్నం హాస్పిటల్‌కు తరలించారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బోల్తా



రాజేంద్రనగర్: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ కారు బోల్తాపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న కారు పిల్లర్ నెంబర్ 315 వద్ద బోల్తా కొట్టింది.ఆ సమయంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. బెలూన్‌లు తెరుచుకోవడంతో చిన్నపాటి గాయాలతో ఇరువురు బయటపడ్డారు. ఈ దారి గుండా వెళ్తున్న వారు వీరిని బయటకు తీశారు. దాదాపు ఈ రహదారిపై 45 నిమిషాల పాటు వాహనాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రమాదం విషయమై ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు.

నీటి ఎద్దడిపై నేడు ధర్నా

రాజేంద్రనగర్: తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు మంగళవారం రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం ఎదట ధర్నా నిర్వహించున్నట్లు అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాగునీరు తక్కువగా సరఫరా అవ్వడంతో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గురు విశ్వస్ఫూర్తి జన్మదిన ఆరాధనోత్సవం

ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు ఆన్‌లైన్ శిక్షణ

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ధ్యాన మనో ప్రస్థానంలో ఆధ్యాత్మిక విశ్వ గురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురు విశ్వస్ఫూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు ఉపయోగపడే ఆన్‌లైన్ ఫ్రీ కంప్యూటర్ క్లాసులు ప్రారంభించారు. 1600 మందికి పైగా యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ మాజీ డైరెక్టర్ ఆచార్య టి. గౌరీశంకర్, ఫార్మర్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. శంకర్‌రావు, సైన్స్ యూనివర్స్ అధినేత రాజేంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

చేవెళ్ల: ఫిట్స్ రావడంతో ఓ ఫాంహౌస్‌లో పనిచేసే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని ముడిమ్యాల బస్ స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొత్తూరు మండలం జేపీ దర్గాకు చెందిన శేఖర్(40) మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం బయటకు వచ్చిన ఆయనకు ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో పోలీసులకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉమ్రా యాత్రకు ముస్లింలు


ఎయిర్ పోర్ట్‌లో ఉమ్రా యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ఉమ్రా యాత్రికులు సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. అల్‌మిజాన్ నిర్వాహకుల ఆధ్వర్యంలో పదిహేను రోజుల యాత్రకు బయలుదేరిన వారికి కుటుంబసభ్యులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

నియమాలు తప్పనిసరిగా పాటించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో నూతన ఆచార్యుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలక మండలి సభ్యుడు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సంస్కార ప్రక్రియలో మనదైన వ్యవస్థలో నియమాలు పాటించే అలవాటు చేసుకోవాలన్నారు. శిశు మందిరాల నిర్మాణానికి ఆచార్యుడే మూలాధారం అని వివరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటనా కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఓటరు నమోదు

మణికొండ: ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటరు నమోదును గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అక్షరాస్యత క్లబ్ కన్వీనర్ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థి అధ్యక్షుడు భానుప్రసాద్ పాల్గొన్నారు.


ఓటరుగా నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

రహదారిపై వరదనీరు

- రాకపోకలకు ఇబ్బందులు
- దెబ్బతిన్న శంషాబాద్–షాబాద్ రోడ్డు
- పెద్దపెద్ద గుంతలతో వాహనదారుల అవస్థలు

శంషాబాద్ రూరల్: వర్షాలకు రహదారిపై వరదనీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శంషాబాద్–షాబాద్ రహదారి పలుచోట్ల దెబ్బతింది. ప్రధానంగా కవేలిగూడ చౌరస్తాలో మూల మలుపు వద్ద వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాలు ఒక వైపు నుంచి మాత్రమే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పరిస్థితి దారుణంగా మారుతోంది.

ఎందుకీ దుస్థితి

వరదనీరు రోడ్డుపై నిలవడానికి ప్రధాన కారణం వరదకాలువను పూడ్చివేయడమేనని స్థానికులు అంటున్నారు. రోడ్డుపై నుంచి వచ్చే వరదనీరు ఇక్కడ రహదారిపై మూలమలుపు ప్రాంతంలో దిగువకు వెళ్లి అక్కడి నుంచి ఈసీవాగులో కలుస్తోంది. అయితే ఈ వరదకాలువను పూడ్చివేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా భారీ భవనాలు వెలిశాయి. దీంతో వరదనీటికి ఆటంకం ఏర్పడి రోడ్డుపైనే భారీగా నిలిచిపోతున్నాయి. చిన్నపాటి వాన కురిసినా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం కురిసిన తర్వాత వారం గడిచినా నీరు బయటకు వెళ్లడం లేదు. పైగా అక్కడ రోడ్డు బురద గుంటలా మారిపోతోంది.

నర్కూడలో..

నర్కూడ గ్రామం మధ్యలో ఉన్న ఈ రహదారిపై గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న గుంతలతో నానా అవస్థలు పడాల్సి వస్తుంది. రోడ్డు మధ్యలో ఉన్న ఆలయం వెనుక భాగంలోనూ భారీ గోతులు ఏర్పడ్డాయి. రహదారిపై వాహనదారులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.


కవేలిగూడ చౌరస్తాలో రహదారిపై నిలిచిన నీళ్లలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

మణికొండ: మహిళలు ఖాళీ సమయంలో ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉండాలని డెంటల్ కేర్ ఆసుపత్రి చైర్మెన్ డాక్టర్ ఎం. పద్మ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో మహిళలకు వారం రోజులుగా కొనసాగుతున్న శిక్షణ, పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలు జ్యోతి, అనిత, సోమవార, నేహా,సుష్మ, ప్రియాంక, లహరి, హారిక, ప్రీతి, లహరి, రమ్యలకు మెడల్‌లు, కప్‌లను ఆమె అందించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ ఎం. వేణు, పిక్సా యానిమేషన్ మేకర్స్ శశికాంత్, కిరణ్‌లు పాల్గొన్నారు.


మెడల్స్ అందుకున్న మహిళలు

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ వేడుకల్లో బుద్వేల్‌కు చెందిన సందీప్‌కుమార్, సంతోషి దంపతులు, శ్రీనివాస్, సుచేత దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.